దేదీప్యం.. గంగమ్మ దర్శనం



గంగమ్మకు హారతులిస్తున్న మాజీ మంత్రి ఆర్కేరోజా

- ఆకట్టుకున్న పుష్పాలంకరణ
- వైభవంగా గంగమ్మ జాతర



గంగమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

నగరి: నగరితో పాటు పరిసరాల్లో ఉన్న 15 గ్రామాలైన ఏకాంబరకుప్పం, కేవీపీఆర్ పేట, సత్రవాడ, వినాయకపురం, చింతపట్టెడ, సాళ్వపట్టెడ, నగరి పేట, రామ్‌నగర్ సీ, రూరల్ మండలంలోని చిన్నతాంగళ్, గుండ్రాజుకుప్పం, గుండ్రాజుకుప్పం ఆది ఆంధ్రవాడ, రామాపురం, ఎస్‌వీ పురం గ్రామాల్లో గంగమ్మ జాతర వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. నగరిలో డప్పు వాయిద్యాలు, బాణాసంచా మోత, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ మంగళవారం రాత్రి గంగమ్మ ఊరిమధ్యలో వేసిన వేపాకు గుడిసెకు చేరారు. ఇక్కడ టీటీడీ ప్రత్యేకంగా చేసిన పుష్పాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పుష్పాలంకరణ నడుమ గంగమ్మ దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిచ్చింది. బుధవారం ఉదయం నుంచి మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారికి వేపాకు సారెలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించారు. వెయ్యికన్నుల దుత్తల్లో దీపాలు సమర్పించారు. తడిదుస్తులతో అంగప్రదక్షిణం చేశారు. గంగమ్మను దర్శించుకోవడానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి దర్శనం కోసం గంటల తరబడి క్యూలో నిరీక్షించాల్సి వచ్చింది. రద్దీ దృష్ట్యా ప్రకాశం రోడ్డులో వాహనాల రాకపోకలను ఆపివేశారు. తోపులాటలు చోటుచేసుకోకుండా జాతర నిర్వహించే అన్ని ప్రాంతాల్లో డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్, సీఐ విక్రమ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలు బందోబస్తు నిర్వహించాయి. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు గంగమ్మ కుంభ నైవేద్యం సమర్పించారు. కర్పూర హారతులు స్వీకరించారు. సాయంత్రానికి చావడి ప్రాంతం జనసమూహంతో కిక్కిరిసింది. మొక్కుబడితో విచిత్ర వేషధారణలో వచ్చిన భక్తులు జాతరలో సందడి చేశారు. బలికూడు సమర్పించే సమయంలో రద్దీ ఎక్కువైంది. రాత్రి గంగమ్మను డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి పొలిమేర దాటించారు.



జాతర ప్రాంతంలో పోలీసు బందోబస్తులో డీఎస్పీ, సీఐ

గంగమ్మకు హారతులిచ్చిన మాజీ మంత్రి ఆర్కేరోజా

మాజీ మంత్రి ఆర్కేరోజా నగరిలో గంగమ్మకు హారతులిచ్చి దర్శించుకున్నారు. అనంతరం వన దుర్గాదేవి అలంకరణలో ఉన్న ఓరుగుంటాలమ్మకు, మహిషాసురమర్దిని అలంకరణలో ఉన్న దేశమ్మకు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఏకాంబరకుప్పం, కేవీపీఆర్ పేట, రామ్‌నగర్‌సీలలో నిర్వహించిన జాతరలలోను పాల్గొని పొన్నియమ్మ, ఎల్లమ్మ, తొప్పయమ్మ, గంగమ్మను దర్శించుకున్నారు. జాతర నిర్వాహకులు ఆమెను ఆలయ మర్యాదలతో సత్కరించారు. అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో జాతర నిర్వాహకులు చిరంజీవిరెడ్డి, దయానిధి, గోపాల్‌రెడ్డి, ఇంద్రారెడ్డి, ఎల్లప్పరెడ్డి, మునిసిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, నాయకులు రమేష్ రెడ్డి, మురుగ, యువరాజ్, ఆనంద్‌కుమార్, సలీం, సేడు, మధు, గుణశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్న వేళలో నటి మీనాక్షి దీక్షిత్ అమ్మవారిని దర్శించుకున్నారు.



భక్తులకు ప్రసాదాల పంపిణీ

స్థానిక గంగమ్మ సేవా సమాజం గంగ జాతరలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేసింది. బుధవారం చావడి ప్రాంగణంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి భక్తులందరికీ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సభ్యులు ప్రసాదాలు పంపిణీ చేశారు.







నిమజ్జనానికి గంగమ్మను ఊరేగింపుగా తీసుకెళ్తున్న జాతర నిర్వాహకులు, గంగమ్మను దర్శించుకున్న సినీ నటి మీనాక్షి దీక్షిత్, దేశమ్మను దర్శించుకుంటున్న ఆర్కేరోజా

క్లుప్తంగా

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయండి

- ఏపీ ఎస్పీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్ గురవయ్య



కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డైరెక్టర్ గురవయ్య

కార్వేటినగరం(పెనుమూరు): వినియోగదారులకు అంతరాయలు లేకుండా విద్యుత్ సరఫరా చేసి మెరుగైన సేవలను అందించాలని ఏపీ ఎస్పీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్ గురవయ్య ఆదేశించారు. బుధవారం ఆయన పెనుమూరు సబ్ స్టేషన్‌తోపాటు సెక్షన్ ఆఫీసును తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులను, విద్యుత్ సరఫరా వివరాలను పరిశీలించారు. వినియోగదారులకు సిబ్బంది అందుబాటులో ఉండాలని, విద్యుత్ సమస్యలు ఎక్కడ తలెత్తినా జాప్యం చేయకుండా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో చిత్తూర్ రూరల్ ట్రాన్స్‌కో ఈఈ సురేష్ కుమార్, ఎంఆర్‌టి ఈఈ బాబు, ఏడీఈలు శేషాద్రిరెడ్డి, రవి, ఏఈ తులసి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

చార్టెడ్ అకౌంటెన్సీతో ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

పుత్తూరు: చార్టెడ్ అకౌంటెన్సీ (సీఏ) చదివిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోనూ ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉన్నాయని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ జి.శ్రీనివాసరాజు అన్నారు. బుధవారం స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్నత విద్య-ఉద్యోగావకాశాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ, సీఏ చదివిన వారికి జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో అవకాశాలకు కొదవ లేదని, సొంతంగా ప్రాక్టీసు చేసుకునే అవకాశం సైతం ఉందన్నారు. కామర్స్‌తో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు తొలి ఏడాది నుంచి సీఏ కోర్సుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి దేవకి, అధ్యాపకులు తిరుమలయ్య, లక్ష్మీబాయి, జ్యోతి, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండండి



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఎయిడ్స్ విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని 'నా ఆరోగ్యం నా హక్కు నినాదం'తో ముందు కెళ్లాలని, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, సీఐలు నిత్యబాబు, మహేశ్వర తెలిపారు. చిత్తూరు నగరంలో బుధవారం జిల్లా ఎయిడ్స్ నివారణ విభాగం ఆధ్వర్యంలో రెడ్ రన్ మారథాన్ నిర్వహించారు. ఈ రన్ మెసానికల్ మైదానం నుంచి పీవీకేఎన్ వరకు సాగింది. వారు మాట్లాడుతూ.. చాలా మంది ఎయిడ్స్ వ్యాధి వచ్చినట్లయితే చాలా ఇబ్బంది పడుతుంటారన్నారు. ఎయిడ్స్ బారిన పడిన వారిని చులకనగా చూడరాదన్నారు. మందులు వాడితే ఎయిడ్స్ తగ్గుముఖం పడుతుందని, ఎవరికైనా వ్యాధి ఉన్నట్టు తెలిస్తే ముఖ్యంగా గర్భిణులు చెక్ చేయించుకోవాలన్నారు. జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ మాట్లాడుతూ.. దేశంలోనే ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల్లో రాష్ట్రం రెండవ స్థానంలో ఉందన్నారు. మన జిల్లాలో ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా చికిత్స పొందుతున్న హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు సుమారు 3 వేల మంది ఉన్నారన్నారు. జిల్లాలో మొత్తం 9 ఐసీటీసీ కేంద్రాల ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. అనంతరం రన్‌లో ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందజేశారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

చిత్తూరు కార్పొరేషన్: ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలనే డిమాండ్‌తో చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. బుధవారం నగరంలో జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ కమిటీ సమావేశం నిర్వహించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజు మాట్లాడారు. అధిక సంఖ్యలో యువత ఉద్యోగాలు లేక ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఓ వైపు కార్పొరేట్ సంస్థలు ట్రావెల్స్ రంగంలో ప్రవేశించడంతో వీరి ఆదాయం తగ్గిందన్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ఏర్పాటు చేయడంతో ఆటోడ్రైవర్ల పరిస్థితి మరింత అధ్వానంగా మారిందన్నారు. . ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 21, 31 వల్ల తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, గోపినాథ్, రమాదేవి, రఘు, తదితరులు పాల్గొన్నారు.

జీవన ఎరువులతోనే దిగుబడులు

కార్వేటినగరం : జీవన ఎరువులతోనే అధిక దిగబడులు వస్తాయని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ఆర్.ఎస్.మునీంద్రనాయుడు, ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణారావు అన్నారు. భూ రక్షణ కార్యక్రమంలో భాగంగా శ్రీరంగరాజపురం మండలంలోని తయ్యూరు, మంగుంట, కార్వేటినగరం మండలాల్లో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా సేంద్రియ జీవన ఎరువులు ఉపయోగించి (జనుము, జీలుగ, పిల్లి పెసర, అలసందులు, అజోస్) పంటలను పండించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు హేమలత, కుసుమ, జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్.ఎ.ఆర్.కె.రావు,మండల హార్టికల్చర్ అధికారి డిల్లీ పాల్గొన్నారు.

ఈకేవైసీపై అవగాహన



రైతులకు ఈకేవైసీపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ చంద్రశేఖర్

పాలసముద్రం: మండల పరిధిలోని బీసీసీ బ్యాంక్ ఖాతాదారులు తప్పకుండా ఈకేవైసీ చేసుకోవాలని గంగాధరనెల్లూరు డీసీసీబీ బ్రాంచ్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం సింగిల్‌విండో కార్యాలయ ఆవరణలో సీఈఓ వెంకటమణి ఆధ్వర్యంలో ఖాతాదారులకు, రైతులకు రుణాలు, ఈకేవైసీపై అవగాన కార్యక్రమం చేపట్టారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తామని తెలిపారు. బ్యాంకుల్లో వివిధ రుణాలు తీసుకోవాలంటే రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. రైతులకు ఇబ్బంది లేకుండా ఎరువులు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం



ఉత్తమ టీచర్లకు సన్మానం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పాలసముద్రం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఘనంగా గురుపూజోత్సవ సంబరాలు జరుపుకున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా బుధవారం ఎమ్మార్సీ భవనం ఆవరణలో ఎంఈఓ రాజేంద్ర ప్రసాద్, గిరిజ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జెడ్పీటీసీ మాజీ సభ్యులు భీమనేని చిట్టిబాబు నాయుడు మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మన దేశానికి చేసిన సేవల గురించి వివరించారు. అదేవిధంగా చిన్నారుల్లో సహజ సిద్ధమైన సామర్థ్యాలు ఉన్నా, వారిని సాన పెట్టి వజ్రాల్లా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే అన్నారు. ఒక విద్యార్థి వ్యక్తిత్వాన్ని, సామర్థ్యాన్ని, భవిష్యత్తును తీర్చిదిద్దే సర్వోన్నత వ్యక్తి ఉపాధ్యాయుడే అన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు, ఎస్‌టీయు యూనియన్ నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ టీచర్‌కు సన్మానం

కార్వేటినగరం: మండలంలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన ఎస్సార్ బాబును బుధవారం ఘనంగా సన్మానించారు. డీఎం పురం ఆదర్శ పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఎస్ఆర్ బాబు ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాల వేసి దుశ్శాలువాలతో సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు చలపతిరావు, భీమారావు మాట్లాడుతూ ఎస్ఆర్ బాబు అంకితభావంతో విద్యార్థులకు మంచి క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నారని కొనియాడారు.



మృతురాలి కుటుంబానికి పరామర్శ



రాణెమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి రోజా, నూకతోటి రాజేష్ తదితరులు

నింద్ర: మండలంలోని అత్తూరుకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల ఆర్టీఐ అధ్యక్షుడు మునిరాజ్ అవ్వ రాణెమ్మ వారం క్రితం మరణించింది. బుధవారం నాగలాపురంలో నిర్వహించిన కర్మక్రియలకు మాజీ మంత్రి రోజా, సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ హాజరై రాణెమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి శ్యామ్‌లాల్, ఎంపీపీ శ్యామ్, సర్పంచ్ చిన్నదొరై, జిల్లా పార్టీ కార్యదర్శి అనిల్, ఎంపీటీసీ సభ్యుడు విజేష్, నాయకులు మహేష్, చార్లి, రాము, రామచంద్రయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శివ శివా..తలుపులు మూసి హుండీ లెక్కింపు..!

- సదా శివేశ్వరాలయ హుండీ ఆదాయంపై అనుమానాలు
- నూతన పాలక మండలిలో వినూత్న పోకడ
- మీడియాకు ఆదాయ వివరాలు వెల్లడించని ఈఓ



సదాశివేశ్వరస్వామి ఆలయం

పుత్తూరు: పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత శ్రీ సదా శివేశ్వర స్వామి ఆలయం హుండీ ఆదాయం లెక్కింపు అనుమానాలకు తావిచ్చింది. బుధవారం మధ్యాహ్నం ఆలయ తలుపులు మూసివేసి ఈ కార్యక్రమం నిర్వహించడం, ఆలయ ఈఓ జయకృష్ణ హుండీ ఆదాయం లెక్కింపు విషయాన్ని ముందుగా ప్రకటించకపోవడంతోపాటు పాటు, లెక్కింపు తర్వాత సైతం ఆదాయ వివరాలను మీడియాకు వెల్లడించకపోవడం ఈ అనుమానాలకు ఊతమిచ్చింది. దీనిపై ఈఓ జయకృష్ణను వివరణ కోరగా..ప్రతిరోజూ మధ్యాహ్నం పూట ఆలయ తలుపులు మూసివేసి ఉంటామని తెలిపారు. అదే సమయంలో హుండీ ఆదాయం లెక్కించినట్టు చెప్పారు. ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ఎలాంటి అవకతవకలు జరిగినా విషయం బయటకు వస్తుందని పేర్కొన్నారు. ఈశ్వరాలయం హుండీ లెక్కింపులో రూ.3,59,599 ఆదాయం రాగా, గ్రామ దేవత ఆరేటమ్మ ఆలయం హుండీ లెక్కింపులో రూ.1,07,769 వచ్చినట్లు వెల్లడించారు. ఏది ఏమైనా హుండీ లెక్కింపులో నూతన పాలక మండలి అనుసరించిన తీరుపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ టీచర్లకు విషయ పరిజ్ఞానం ముఖ్యం



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సంధ్య

పుత్తూరు: అంగన్‌వాడీ టీచర్లు విషయ పరిజ్ఞానం కలిగి ఉండటం ముఖ్యమని సూపర్‌వైజర్ సంధ్య అన్నారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు ఆశావహ దృక్పథం, వైఖరి అనే అంశాలపై పది రోజుల అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. టీచర్లు లింగ సమానత్వం, మహిళ భద్రత, న్యాయ విజ్ఞానం, మహిళా సాధికారిత, రుతుక్రమ పరిశుభ్రత, పోక్సో చట్టం వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అన్ని అంశాలు సభి గ్రూపులో అంగన్‌వాడీ కార్యకర్తలు సిబ్బందికి, మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు గీతాంజలి, శ్రీదేవి, అనిత, వన్ స్టాప్ సెంటర్ కో-ఆర్డినేటర్ అరుణ, టాటా ట్రస్ట్ కో-ఆర్డినేటర్ సంతోషి, పుత్తూరు, వడమాలపేట అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

నేల కూలిన విద్యుత్ స్తంభాలు



గాలికి విద్యుత్ తీగలపై పడిన కొబ్బరి చెట్టు



విద్యుత్ తీగలపై కొబ్బరి చెట్టు పడడంతో విరిగిపోయిన మూడు విద్యుత్ స్తంభాలు



పాలసముద్రం: గాలీవానతో కూడిన ఆకస్మిక వర్షానికి ఆస్తినష్టం వాటిల్లింది. బుధవారం సాయంత్రం మండలంలోని శ్రీకావేరిరాజుపురం మిట్టదళితవాడలో వర్షానికి మూడు విద్యుత్ స్తంభాలు, కొబ్బరి చెట్టు నేల కూలిపోయాయి. దీంతో తీవ్ర విద్యుత్ అంతరాయం కలిగింది. విపరీతమైన గాలులతో కూడిన వర్షం పడడంతో కొబ్బరి చెట్టు విద్యుత్ తీగలపై పడింది. దీంతో మూడు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి.. కూలిన విద్యుత్ స్తంభాలను తొలగించి.. వాటిస్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

18న వాహనాల వేలం

గుడిపాల: వివిధ కేసుల్లో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలను ఈనెల 18వ తేదీన గుడిపాల పోలీస్‌స్టేషన్‌లో వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు కేసుల్లో 37 ద్విచక్ర వాహనాలతో పాటు ఒక స్కార్పియో, ఒక మారుతీ కారుకు కూడా వేలం వేస్తామన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు, డీఎస్పీ సాయినాథ్ ఆధ్వర్యంలో వేలం నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు ముందుగా రూ.2 వేలు డిపాజిట్ చేసి వారి పేరు నమోదు చేసుకుని వేలంలో పాల్గొనాలని కోరారు.